నమస్తే తెలంగాణ

రంగారెడ్డి

I | హైదరాబాద్, బుధవారం 26 జూన్ 2024 | RANGAREDDY


### పెట్టుబడి సాయం అదునుకు ఇవ్వాలి



పెట్టుబడి సాయాన్ని అదునుకు ఇవ్వాలి. గత ప్రభుత్వం సాగు సమయానికి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. 10 ఎకరాల్లోపు ఉన్న రైతులకు రైతుభరోసా అందజేస్తే సరిపోతుంది. అంతకు మించి ఉన్న రైతులకు అవసరం లేదు. ఉన్నతాధికారులు స్థానిక రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి పంపించాలి.

– వెంకట్‌రెడ్డి, పూడూరు

### వందల ఎకరాలు ఉన్నోళ్లకు సాయమెందుకు..



ఇరవై, ముప్పై, అంత కంటే ఎక్కువ.. వందల ఎకరాలు ఉన్న రైతులకు పెట్టుబడి సాయం ఎందుకు. చిన్న, సన్నకారు రైతులకే రైతుభరోసా ఇవ్వాలి. రియల్ ఎస్టేట్ భూములకు ఇవ్వొద్దు. కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తే ఒప్పుకోం. వరిలో దొడ్డురకం, సన్నరకం అనకుండా అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి.

– కావలి సత్యయ్య, మెట్లకుంట, బొంరాస్‌పేట మండలం

### ముందుగా ఇస్తే ఎరువులు, విత్తనాలు కొంటాం..



రైతు భరోసా సాయాన్ని ముందుగా ఇస్తే ఎరువులు, విత్తనాలను కొంటాం. ఆలస్యంగా ఇవ్వడం వల్ల అప్పులు చేసి కొనుగోలు చేయాల్సి వస్తున్నది. సరిపడా విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలి. అదునుకు సాగు చేయకపోతే తీవ్రంగా నష్టపోయే అవకాశముంటుంది.

– అంకం రాజు, నందిగామ

### ఐటీ కట్టేవారికీ రైతు భరోసా ఇవ్వాలి..



గత ప్రభుత్వం ప్రతి రైతుకూ సాయమందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అన్ని కొర్రీలు పెడుతున్నది. పిల్లల చదువుకు, ఏ ప్రాపర్టీ కొనుగోలు చేసినా ఐటీ కట్టే పరిస్థితి ఉన్నది. కాబట్టి ఐటీ కట్టే వారికీ సాయం అందించాలి. పెట్టుబడికి వడ్డీకి డబ్బులు తెచ్చుకునేవారు ఉన్నారు.

– యాట జగన్, జాపాల



- కౌలు రైతులకు పెట్టుబడి సాయమిస్తే కౌలు ఇచ్చుడు బంద్ చేస్తాం
- బీడు భూములుగానైనా ఉంచుతాం కానీ కౌలుకివ్వం
- ఐటీ చెల్లించే వారికి కూడా రైతు భరోసా అమలు చేయాలి
- పంట వేసిన భూములకే పెట్టుబడి సాయమివ్వాలి
- వర్షాలు పడకముందే సాయమందించాలి
- కేసీఆర్ ప్రభుత్వంలో సాగు సమయానికి పెట్టుబడి సాయం
- రైతుల నుంచి ఆధార్ కార్డులు మాత్రమే సేకరణ

# కౌలు రైతులకు వద్దు



మంచాల రైతు వేదికలో టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు

వికారాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ) : ఎట్టిపరిస్థితుల్లోనూ కౌలు రైతులకు రైతు భరోసా కింద అందించే పెట్టుబడి సాయం ఇవ్వొద్దనే అభిప్రాయాన్ని జిల్లా రైతాంగం వెల్లడించింది. ఒకవేళ నిజమైన రైతులకు కాకుండా కౌలు రైతులకు పెట్టుబడి సాయమందించడంతోపాటు ప్రాధాన్యతిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టాదారులకు కాకుండా కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించే ఆలోచనపై ఏకపక్షంగా రైతులు వ్యతిరేకించారు. కౌలు రైతులకు రైతు భరోసా ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంటే తమ భూములను బీడు భూములుగానైనా ఉంచుతాం కానీ కౌలుకు ఇవ్వబోమని తెగేసి చెబుతున్నారు. వర్షాలు పడకముందే రైతు భరోసాను అందజేయాలని, విత్తనాలు, ఎరువులను అప్పులు చేసి తెచ్చుకున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో మాత్రం సాగుకు ముందే పెట్టుబడి సాయాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేవారని రైతులు గుర్తు చేసుకున్నారు. ఐటీ చెల్లించే వారికీ రైతు భరోసాను అమలు చేయాలని, పిల్లల చదువులు, పెండ్లిళ్లకు బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకుగాను ప్రతి ఒక్కరూ ఐటీ చెల్లిస్తున్నారని.. కాబట్టి తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. ఖాళీ భూములకు రైతు భరోసా ఇవ్వద్దనే ప్రచారం జరుగుతుండడంపై రైతులకు ఉన్న ఒకట్రెండు ఎకరాలకు అందే సాయాన్ని కూడా నిలిపివేసేందుకు ఆలోచించడం సరైంది కాదన్నారు.

జిల్లాలో పూడూరు, మోమిన్‌పేట, తాండూరులలోని రైతు వేదికల్లో రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ జరిగింది.

**ఆధార్ కార్డుల సేకరణ..**

రైతు భరోసా అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన అభిప్రాయ సేకరణ నామమాత్రంగా జరిగింది. జిల్లాలోని మోమిన్‌పేట మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో రైతుల అభిప్రాయాలు సేకరించకుండానే వ్యవసాయాధికారులు వెనక్కి పంపారు. అభిప్రాయ సేకరణకు ఏఈవోలు అతికష్టం మీద తీసుకొచ్చిన ఐదారు మంది రైతుల అభిప్రాయాలను కూడా వ్యవసాయాధికారులు పట్టించుకోకుండా ప్రభుత్వానికి అనుకూలమైన అభిప్రాయాలను మాత్రమే ప్రభుత్వం సూచించిన ఫార్మాట్‌లో వివరాలను పూర్తి చేసి పంపారు. రైతు వేదికకు వచ్చిన రైతుల నుంచి ఆధార్ కార్డులను మాత్రమే తీసుకొని, ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న వారితో మాట్లాడారని రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ అభిప్రాయాన్ని వెల్లడించేందుకు వస్తే కేవలం ఆధార్ కార్డులు ఇచ్చి వెళ్లండని చెప్పడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు.

### కౌలు రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వొద్దు..



కౌలు రైతులకు ఎట్టిపరిస్థితుల్లోనూ పెట్టుబడి సాయాన్ని ఇవ్వొద్దు. పట్టాదారులను కాకుండా కౌలు రైతులకు ఇస్తే భూములను బీడుగా అయినా ఉంచుతాం. ప్రభుత్వం కౌలు రైతులకు ఇస్తానన్న నిర్ణయాన్ని మార్చుకోవాలి. వానకాలానికి ముందే పెట్టుబడి సాయాన్ని అందించాలి.

– మల్లారెడ్డి, రైతు మోమిన్‌పేట

### సీజన్ కంటే ముందే పెట్టుబడి సాయం ఇవ్వాలి



యాసంగి, వానకాలం సీజన్ల కంటే ముందే పెట్టుబడి సాయాన్ని అందించాలి. తీరా సాగు పనులు మొదలు చేశాక అదును దాటాకా సాయమిస్తే ఏం లాభం. ముందుగా సాయమందిస్తే ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసి సమయానికి సాగు చేసుకుంటాం. అప్పుడే రైతులకు మేలు జరుగుతుంది.

– నర్సింహులు, తుంకిమెట్ల, బొంరాస్‌పేట మండలం

### పది ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలి..



పది ఎకరాల్లోపు రైతు భరోసా ఇవ్వాలి. సాగు వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు సేకరించి, సాగు భూములకే వర్తించేలా చర్యలు తీసుకోవాలి. రియల్ ఎస్టేట్ భూములు, ఎకరాలకొద్దీ గుట్టలున్న భూములకు రైతు భరోసా ఇవ్వొద్దు. ఇచ్చే సాయమేదో సమయానికి ఇస్తే బాగుంటుంది.

– శ్రీనివాస్ గౌడ్, మంచాల

# భరోసా కొందరికేనా!

- 'రైతు భరోసా'పై జిల్లాలోని ఐదు రైతు వేదికల్లో నిర్వహించిన అభిప్రాయ సేకరణ
- హాజరైంది 356 మంది రైతులే!
- తూతూమంత్రంగా సాగిన అభిప్రాయ సేకరణ
- రాతపూర్వకంగా అభిప్రాయాలు వెలిబుచ్చిన వంద మంది
- 'పరిమితి' వద్దు.. కనీసం పది ఎకరాలకైనా ఇవ్వాలని ముక్తకంఠంతో డిమాండ్
- కౌలు రైతులకు సాయంపై భిన్నాభిప్రాయాలు
- ఐటీ కడితే.. సాయం కట్ చేయడం సరైంది కాదు..
- రేషన్ కార్డును ప్రామాణికం తీసుకోవద్దని విన్నపం



మొయినాబాద్‌లో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న చేవెళ్ల డివిజన్ రైతులు



రంగారెడ్డి, జూన్ 25 (నమస్తే తెలంగాణ) : పంట పెట్టుబడి సాయం రూపు మారుతున్నది. సాగు చేస్తున్న భూములకే 'రైతు భరోసా' కింద ఆర్థిక సాయం అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. పలు కొర్రీలతో సాయాన్ని తగ్గించి ఆర్థిక భారాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నది. రైతుల నుంచి వ్యతిరేకత వస్తే ఎలా? అని ముందే గ్రహించిన ప్రభుత్వం రైతుల మనసులో ఉన్నదేమిటో తెలుసుకునేందుకు అభిప్రాయ సేకరణను చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు రంగారెడ్డి జిల్లాలో మంగళవారం ఐదు రైతు వేదికల్లో వ్యవసాయ శాఖ అభిప్రాయ సేకరణను చేపట్టింది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మంచాల రైతు వేదిక, మహేశ్వరం నియోజకవర్గంలో కందుకూరు, షాద్‌నగర్ నియోజకవర్గంలో నందిగామ, రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మల్కారం, చేవెళ్ల నియోజకవర్గంలో మొయినాబాద్‌లోని రైతు వేదికలో అభిప్రాయ సేకరణను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతులు అంతంత మాత్రంగానే హాజరయ్యారు. ఐదు రైతు వేదికలకు కేవలం 356 మంది మాత్రమే హాజరుకాగా.. అభిప్రాయ సేకరణ సైతం తూతూమంత్రంగానే సాగింది. రైతు వేదికకు ఒక్క రైతుతోనే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడించారు. మిగతా రైతుల నుంచి రాతపూర్వకంగా అభిప్రాయాలను సేకరించారు. ఇలా సేకరించిన వంద మంది రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి పంపనున్నట్లు అధికారులు తెలిపారు.

**'పరిమితి' సరైంది కాదు..**

బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని మొదలుపెట్టిన నాటి నుంచి గత ఏడాది వానకాలం సీజన్ వరకు మొత్తంగా జిల్లా రైతులకు పెట్టుబడి సాయంగా రూ.3,337 కోట్లు అందజేసింది. గత ఏడాది యాసంగి సీజన్ కొనసాగుతున్న సమయంలోనే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు యాసంగి సీజన్‌కు గతంలో మాదిరే రైతులకు ఆర్థిక సాయం ఇస్తామని ప్రకటించి నెలల తరబడిగా సాయాన్ని కొనసాగించింది. సాయం భారాన్ని తగ్గించుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పరిమితులు విధించేందుకు సిద్ధమవుతున్నది. ఐదెకరాల్లోపు భూములున్న రైతులకే ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలుస్తున్నది. ఆదాయపన్ను చెల్లించే ఉద్యోగులు, ఇతర వర్గాల వారికి రైతు భరోసాను నిలిపివేయనున్నారు. ఈ క్రమంలో అభిప్రాయ సేకరణ సందర్భంగా పలువురు రైతులు ప్రభుత్వ నిర్ణయంపై ఆక్షేపణ తెలిపారు. పంటలను సాగు చేసిన అన్ని ఎకరాలకు రైతు బంధు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. కనీసం పది ఎకరాల వరకైనా ఇస్తే బాగుంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రుణాలు, ఇతరత్రా అవసరాల నిమిత్తం రైతులు ఆదాయ పన్ను చెల్లిస్తున్నారని, వారికి సాయం ఇవ్వకపోతే ఎట్లా? అని ప్రశ్నించారు. రేషన్ కార్డును సైతం ప్రామాణికంగా తీసుకోవద్దని సూచించారు. కౌలు రైతులకు సాయంపై రైతుల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమైంది. కౌలు రైతులకు సాయం ఇవ్వడం వల్ల భూయజమానులు కౌలు రైతులకు భూములు ఇచ్చే ప్రసక్తి ఉండదని, ప్రభుత్వ నిర్ణయం.. కౌలు రైతుల పొట్టగొట్టడమే అవుతుందని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. సాయాన్ని ఇరువురికి సమానంగా ఇస్తే బాగుంటుందన్న అభిప్రాయం.. కొన్ని రైతు వేదికల్లో రైతుల నుంచి వ్యక్తమైంది.

**వానకాలం సీజన్‌కు సాయం అందేనా..**

యాసంగి సీజన్ రైతుబంధు పంపిణీలో తీవ్ర జాప్యం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుత వానకాలం సీజన్‌లోనైనా సక్రమంగా ఇస్తుందా! లేదా? అన్న అనుమానాలను అభిప్రాయ సేకరణ సందర్భంగా పలువురు రైతులు వ్యక్తం చేశారు. వానకాలం సీజన్‌కు ఎకరాకు రూ.10వేలు ఇస్తుందా? లేక రూ.15వేలు ఇస్తుందా? అన్న సందేహాలను సైతం పలువురు రైతులు వ్యక్తం చేశారు. రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ చేపట్టడం.. అసెంబ్లీలో చర్చించాక ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రకటిస్తామని చెబుతుండడంతో వానకాలం సీజన్‌కు పెట్టుబడి సాయం అందించడంలో జాప్యం జరిగే అవకాశం ఉన్నదని రైతులు అనుమానం వ్యక్తం చేశారు. యాసంగి సీజన్‌లో మాదిరిగానే పంట వేసే సమయంలో కాకుండా పంట కోతలు పూర్తయ్యాక జమ చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదన్న గుసగుసలు రైతుల నుంచి వినిపించాయి. ఎన్ని ఎకరాల్లో పంటలను సాగు చేశారో! నిర్ధారించాకే సాయం అందించే అవకాశం ఉందన్న టాక్ వినిపిస్తుండగా.. ప్రభుత్వం ఇదే విధానాన్ని అవలంబిస్తే.. సీజన్ మధ్యలో లేదా చివరలో సాయం సొమ్మును అందజేసే అవకాశాలున్నాయని రైతులు సందేహిస్తున్నారు. ఏదిఏమైనా.. సీజన్ ఆరంభంలోనే పెట్టుబడి సాయం అందిస్తే ప్రయోజనం ఉంటుందని రైతులు అభిప్రాయాలను వెల్లడించినట్లు అధికారులు స్పష్టం చేశారు.

### సాయం అందించడంలో నిర్లక్ష్యం చేయొద్దు..



గత ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అదునుకిచ్చేది. రైతు భరోసా ఇవ్వడంలో ఎట్టి పరిస్థితిల్లోనూ నిర్లక్ష్యం చేయొద్దు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసాను పెంచాలి. సమయానికి ఇవ్వకపోతే విత్తనాలు, ఎరువులు కొనేందుకు అప్పులు చేయాల్సి వస్తుంది. రైతులు ఇబ్బందులు పడుతారు.

– కొంగర యాదగిరి, నర్సప్పగూడ, నందిగామ మండలం

### సాగు భూములకే రైతు భరోసా ఇవ్వండి..



సాగు చేస్తున్న భూములకే రైతు భరోసా ఇవ్వండి. 20, 30, ఆపైన ఉన్న రైతులకు పెట్టుబడి సాయం అవసరం లేదు. ప్లాట్లు చేసే భూములు, ఫామ్ హౌస్‌లకు రైతు భరోసా ఇవ్వద్దు. ఏక కాలంలోనే రుణమాఫీ చేయాలి. ఐటీకి సంబంధం లేకుండా పెట్టుబడి సాయమందిస్తే మంచిది. లేదంటే తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుంది.

– దారెడ్డి సుధాకర్‌రెడ్డి, కేతిరెడ్డిపల్లి, మొయినాబాద్

# మహిళా సంఘాలకు వడ్డీ డబ్బులు



**జిల్లాలో 9802 సంఘాలకు రూ.7.95 కోట్లు మంజూరు**

బొంరాస్‌పేట, జూన్ 25 : మహిళా సంఘాలు ఊరటచెందే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహిళా స్వయం సంఘాలు తీసుకున్న రుణాలకు చెల్లించిన వడ్డీని ప్రభుత్వం తిగిరి వారి వారి ఖాతాలలో జమ చేసింది. వికారాబాద్ జిల్లాలోని 9802 మహిళా సంఘాలకు గత ఏడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది మార్చి వరకు నాలుగు నెలలకు సంబంధించిరూ.7.95 కోట్లను ప్రభుత్వం మహిళా సంఘాల ఖాతాలలో జమ చేసింది. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి వాటికి బ్యాంకు లింకేజీ ద్వారా, స్త్రీనిధి ద్వారా వడ్డీలేని రుణాలను అందిస్తుంది. వాయిదాల ప్రకారం మహిళా సంఘాల సభ్యులు ప్రతినెలా కొంత అసలు, వడ్డీ చెల్లించాలి. పేద మహిళలకు వడ్డీ భారం కావద్దన్న ఉద్దేశంతో ప్రతినెలా సక్రమంగా రుణాలు తిరిగి చెల్లిస్తున్న సంఘాలకు వడ్డీని తిరిగి చెల్లిస్తుంది. చాలా ఏళ్ల నుంచి నిలిచిపోయిన వడ్డీ చెల్లింపులు ఖాతాలలో జమ చేయడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో రుణాలు చెల్లిస్తున్న సంఘాలకు ప్రభుత్వం తిరిగి వడ్డీని చెల్లిస్తుండడంతో మహిళలు మరింత చైతన్యంగా తమ ఆర్థిక కార్యకలాపాలను చేపట్టి ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. వడ్డీలేని రుణాలు తీసుకున్న మహిళలు స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకుని స్వయం స్వావలంబన సాధిస్తున్నారు.

**9802 సంఘాలకు రూ.7.95 కోట్లు..**

వికారాబాద్ జిల్లాలోని 19 మండలాల్లో రుణాలను సకాలంలో చెల్లించిన 9802 మహిళా సంఘాలకు ప్రభుత్వం రూ.7.95 కోట్ల వడ్డీని వారి ఖాతాలలో జమ చేసింది. బంట్వారం మండలంలోని 339 సంఘాలకు రూ.31 లక్షలు, బషీరాబాద్‌లోని 458 సంఘాలకు రూ.37 లక్షలు, బొంరాస్‌పేటలోని 586 సంఘాలకు రూ.45 లక్షలు, చౌడాపూర్‌లోని 152 సంఘాలకు రూ.13 లక్షలు, ధారూరు మండలంలోని 388 సంఘాలకు రూ.32 లక్షలు, దోమ మండలంలోని 737 సంఘాలకు రూ.61 లక్షలు, దౌల్తాబాద్ మండలంలోని 524 సంఘాలకు రూ.41 లక్షలు, కొడంగల్‌లోని 422 సంఘాలకు రూ.35 లక్షలు, కోట్‌పల్లిలో 379 సంఘాలకు రూ.37 లక్షలు, కులకచర్లలో 937 సంఘాలకు రూ.75 లక్షలు, మర్పల్లిలో 688 సంఘాలకు రూ.62 లక్షలు, మోమిన్‌పేటలో 605 సంఘాలకు రూ.48 లక్షలు, నవాబుపేటలో 561 సంఘాలకు రూ.34 లక్షలు, పరిగిలో 542 సంఘాలకు రూ.48 లక్షలు, పెద్దేముల్‌లో 504 సంఘాలకు రూ.39 లక్షలు, పూడూరులో 412 సంఘాలకు రూ.35 లక్షలు, తాండూరులో 671 సంఘాలకు రూ.55 లక్షలు, వికారాబాద్‌లో 274 సంఘాలకు రూ.17 లక్షలు, యాలాల మండలంలోని 623 మహిళా సంఘాలకు రూ.53 లక్షల వడ్డీని ప్రభుత్వం మంజూరు చేసింది.





### కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అను నేను..

ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీగా గెలుపొందిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మంగళవారం పార్లమెంట్‌లో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తాయి.